

పుస్తకం.. వ్యక్తిత్వాన్ని మారుస్తుంది

(5వ పేజీ తరువాయి)

పుస్తకమే అని, మనిషిని మహనీయునిగా తీర్చిదిద్దగలిగేది పుస్తక పఠనమే అని నొక్కిచెప్పారు. పల్లెల్లో చైతన్యం తీసుకురావాలి అనే సంకల్పంతో, తాను ఇంటినే గ్రంథాలయంగా మార్చడంతో పాటు పన్నెండు గ్రంథాలయాల స్థాపనకు తోడ్పాటు అందించినట్లు తెలిపారు. రెండు లక్షల పుస్తకాలతో కొలువుదీరిన తన గ్రంథాలయానికి నిత్యం సుదూర ప్రాంతాల నుంచి పరిశోధక విద్యార్థులు వస్తుంటారని వివరించారు. వారిలో 11 మంది పీహెచ్‌డీ డాక్టరేట్లు పొందారని తెలిపారు. గద్దర్, రవ్వా శ్రీహరిలతో తనకున్న అనుబంధాన్ని కూరెళ్ల గుర్తుచేశారు. ఆచార్య రవ్వా శ్రీహరి సాహిత్య, సాంస్కృతిక వేదికను ప్రారంభించిన ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ పుస్తకపఠనం సంస్కృతిగా మారాలని ఆకాంక్షించారు. అనేక పుస్తకాలు ఒకచోట లభ్యం అవ్వడంతో పాటు పుస్తకాభిమానులంతా కలుసుకోడానికి ఇదొక మంచి వేదిక అని అన్నారు. కొందరు వ్యక్తిగత చొరవతో గ్రామాల్లో గ్రంథాలయాలు నెలకొల్పి, తద్వారా పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ గ్రంథాలయాల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిపారు. గ్రంథాలయాల్లో 30 ఏళ్లుగా నియామకాలు లేవని, పదేళ్లుగా పుస్తకాల కొనుగోళ్లు ఆగిపోయాయని విచారం వ్యక్తంచేశారు. కొత్త ప్రభుత్వం గ్రంథాలయాలను పటిష్ట పరచాలని కె. శ్రీనివాస్ కోరారు. సభాధ్యక్షత వహించిన బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలోనూ పుస్తక పాఠకులు తగ్గడంలేదనడానికి కోల్‌కతా బుక్ ఫెయిర్‌కు లభించిన ఆదరణ నిదర్శనం అన్నారు. గద్దర్ పేరుతో జానపద విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని బుక్ ఫెయిర్ వేదికగా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. గద్దర్ కుమార్తె వెన్నెల మాట్లాడుతూ ఆపరేషన్ థియేటర్‌కు వెళ్లే ముందు కూడా గద్దర్ పుస్తకం చదివారని తెలిపారు. ఎన్ని పనులున్నా, రోజుకు ఒక గంటైనా పుస్తక పఠనానికి కేటాయించే వారని, ఆయన్ను చూసి తమ కుటుంబ సభ్యులు పుస్తక పఠనాన్ని అలవర్చుకున్నట్లు వెన్నెల తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆర్. శ్రీనివాస్, వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్, సీనియర్ జర్నలిస్టులు శ్రీనివాస్ రెడ్డి, సుధా భాస్కర్, కవి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితం సముచితం కాదంటూ..

పుస్తక మహోత్సవాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ అమర వీరుల స్మారక స్తూపంతో పాటు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, గద్దర్ ఫౌండేషన్, నవ తెలంగాణ, తెలుగు వికీపీడియా, అక్షరయాన్ స్టాళ్లను ఆవిష్కరించారు. ఏడాదికి ఒకసారి కాదు, రెండు సార్లు పుస్తక ప్రదర్శన నిర్వహించడానికి తమ ప్రభుత్వం సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. బుక్ ఫెయిర్ నిర్వాహకులను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ప్రచురణలను ఆ శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మంత్రికి బహూకరిస్తుండగా, పుస్తకాలు ఉచితంగా తీసుకోవడం సముచితం కాదంటూ వెల చెల్లించారు. మరొక స్టాల్‌లోనూ అలిశెట్టి ప్రభాకర్ కవిత్వం, గోల్కొండ చరిత్ర, గద్దర్ సాహిత్యాన్ని మంత్రి కొనుగోలు చేశారు.

బుక్‌ఫెయిర్‌లో నేటి కార్యక్రమాలు

- **మధ్యాహ్నం 2గంటలకు** : బాల వికాస్ కార్యక్రమాల ప్రారంభం
- **సాయంత్రం 5.30 గంటలకు** : పాలపిట్ట బుక్స్ ఆధ్వర్యంలో గులాబీల మల్లారెడ్డి రచనల ఆవిష్కరణ
- **సాయంత్రం- 6 గంటలకు** : గద్దరన్న యాదిలో
- 8 గంటలకు జానపద కళారూపాల ప్రదర్శన

బుక్ ఫెయిర్ సందర్శన వేళలు

- మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 9 గంటల వరకు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు...

- లెల్లె సురేష్ దర్శకత్వంలో గద్దర్ జీవితం ఆధారంగా స్వప్నమైన నిజం నృత్య రూపకాన్ని చిందు ఆర్గనైజేషన్ కళాకారిణిలు ప్రదర్శించారు.
- భూపతి వెంకటేశ్వర్లు దర్శకత్వంలో 'మన చరిత్ర' నాటకాన్ని ముషీరాబాద్‌కు చెందిన చిన్నారులు ప్రదర్శించారు. తమదైన అభినయంతో చిన్నారులు సభికులను ఆకట్టుకున్నారు. ప్రదర్శన

పీవీకి భారతరత్న.. మురిసిన సాహితీలోకం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): భారతరత్నకు ఎంపికైన పాములపర్తి వెంకట నరసింహారావుకు హైదరాబాద్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. ఉమ్మడి కరీంనగర్‌లోని వంగర గ్రామంలో పుట్టిన ఆయన వృత్తి, రాజకీయ వ్యవహారాల నేపథ్యంలో నగరంలో చాలాకాలం నివసించారు. దేశ అత్యున్నత పురస్కారం వరించిన వేళ భాగ్యనగరంలో ఆయన జ్ఞాపకాలు స్మరించుకుంటే.. తొలినాళ్లలో పీవీ నరసింహారావు ప్రముఖ న్యాయవాది బూర్గుల రామకృష్ణారావు (తర్వాత హైదరాబాద్ ముఖ్యమంత్రి) వద్ద కొంతకాలం జూనియర్‌గా ప్రాక్టీసు చేశారు. 1940-50 మధ్యకాలంలో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్, భారతీయ కమ్యూనిస్టు పార్టీ కార్యాలయాలు సుల్తాన్‌బజార్‌లో ఉండేవి. అప్పట్లో రాజకీయ సమావేశాలకు ఆ ప్రాంతమే అడ్డా. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పీవీ స్వామి రామానంద తీర్థ అనుయాయిగా తనవంతు పాత్ర పోషించారు. గురువు పేరుతో బేగంపేటలో ట్రస్ట్‌ను నెలకొల్పారు. తద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు సాంకేతిక విద్య లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నారాయణగూడలోని ప్రముఖ సాహితీ పరిశోధకుడు పల్లా దుర్గయ్య (ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎం.ఏ. తెలుగు పట్టా పొందిన తొలివ్యక్తి) ఇంటి ఆవరణం సాహితీ సమావేశాలకు కేరాఫ్. ఆ ఇంటి చుట్టుపక్క గదుల్లో ప్రముఖ సాహితీ దిగ్గజాలు బిరుదురాజు రామరాజు, దాశరథి కృష్ణమాచార్య తదితరులు అద్దెకుండేవారు. అక్కడే వారంతా కలిసి వారానికొకసారి సాహితీ సమావేశాలు నిర్వహించేవారు. ఆ చర్చలకు పట్టికోట, సినారె, కాళోజీతోపాటు పీవీ నరసింహారావు తరచుగా హాజరయ్యేవారని పలు రచనల ద్వారా తెలుస్తోంది.

భాషా నిలయంలో..

ప్రజాకవి కాళోజీతో పీవీ నరసింహారావుకు స్నేహబంధం ప్రత్యేకమైంది. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం వేదికగా ఆనాటి రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా ఉన్న పీవీ.. కాళోజీ షష్టిపూర్తి మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమాన్ని నిర్వహించిన తీరే ఇరువురి మైత్రీబంధానికి ఉదాహరణ. ఆయన దేశానికి నేతైనా తన చిన్ననాటి మిత్రుడు కాళోజీ చేత మాత్రం 'ఏరా' అని పిలిపించుకోగలిగిన గొప్ప స్నేహితుడు పీవీ అని "మన భారత ప్రధాని" రచన ద్వారా అవగతమవుతోంది.

కక్షతో హత్య..

(5వ పేజీ తరువాయి)

అతడి స్నేహితుడు వినోద్‌కుమార్ వస్తుంటారు. ఆ మహిళ కుమార్తెతో వినోద్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. రామన్న కూడా ఆమెపై మనసు పడ్డాడు. ఈ విషయం వినోద్‌కు తెలిసింది. రామన్న తీరుపై వినోద్ నొచ్చుకుని విషయాన్ని మణికంఠకు చెప్పాడు. ఇదే అదునుగా ఇద్దరూ కలిసి రామన్న చంపాలనుకున్నారు. రౌడీషీటర్ కైసర్‌తో హత్యకు ఒప్పందం కుదుర్చుకున్నారు. పథకం ప్రకారం.. మహిళ కుమార్తెతో రామన్నకు ఫోన్ చేయించి లక్ష్మీనర్సింహనగర్‌కు పిలిపించారు. అక్కడకు మణికంఠ, వినోద్ తదితరులు వచ్చి కత్తులతో రామన్నపై దాడి చేశారు. అతడి మర్మాంగాలను కోసి దారుణంగా హత్య చేశారు. స్నేహితుడైన ఫిరోజ్‌కు వినోద్ వీడియో కాల్‌లో చూపించాడు. అనంతరం కార్లలో పారిపోయారు. ఓ బార్ వద్ద పార్టీ చేసుకున్నారు. బాణాసంచా కాల్చారు. హత్య గురించి సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు తగిన ఆధారాలతో మణికంఠ, వినోద్, కైసర్, అతడి కావలి శివకుమార్, కప్పల నిఖిల్, తున్న కుమార్‌తోపాటు మహిళ, ఆమె కుమార్తెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

6 నుంచి 11 వరకు కీసర బ్రహ్మోత్సవాలు

కీసర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా మార్చి 6 నుంచి 11 వరకు కీసరగుట్టలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ గౌతమ్ చెప్పారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో కలెక్టర్ బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. ఉత్సవాలకు వచ్చే సామాన్య భక్తులకు పెద్దపీట వేసి, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు.

ఇళ్లెదుట చెత్త వేయొద్దు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి : డీఎంసీ



ఉన్నికోటలో చెత్తను పరిశీలిస్తున్న డీఎంసీ తిప్పర్తి యాదయ్య

కవాడిగూడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ముషీరాబాద్ సర్కిల్-15 డీఎంసీ తిప్పర్తి యాదయ్య అన్నారు. కవాడిగూడ డివిజన్ ఉన్నికోటలో జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం కింద నిర్మించిన ఇళ్ల మధ్యలో చెత్తాచెదారం పేరుకుపోతోందని, నిత్యం డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని, చిత్రాల నగర్‌లో డ్రైనేజీలు పొంగిపొర్లుతుండటంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేశారు. డీఎంసీ, హెల్త్ అధికారి మైత్రేయి, వివిధ శాఖల అధికారులు ఆయా బస్తీల్లో శుక్రవారం పర్యటించారు. డీఎంసీ మాట్లాడుతూ.. జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం కింద నిర్మించిన ఇళ్లలో నివసిస్తున్న వారు చెత్తను ఇళ్ల ఎదుట వేయొద్దని, రిక్షాలలో వేయాలని సూచించారు. ఉన్నికోటలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. పరిసరాలు శుభ్రంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు.

బీఆర్ఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నగర కార్యాహక కార్యదర్శి మద్దెల ప్రభాకర్, యూసీడీ అధికారి మధు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఐఏ దాడులపై సీఎం స్పందించాలి

పౌర హక్కులు, ప్రజాసంఘాల నేతలు



మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం నేత ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం

నల్లకుంట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్లీ జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) దాడులు పుంజుకుంటున్నాయని, ప్రశ్నించే గొంతుకలైన కళాకారులు, రచయితలపై విచారణ పేరుతో ఇళ్లలో సోదాలు నిర్వహించడం దారుణమని, ఇటీవలి ఘటనలపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు.

ఇటీవల వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, నార్ల రవి ఇళ్లపై ఎన్ఐఏ దాడులు చేయడం, కార్యాలయానికి రావాలని హుకుం జారీ చేయడం అన్యాయమన్నారు. ఎన్. వేణుగోపాల్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తానని రేవంత్‌రెడ్డి అన్నారని, కానీ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. అక్రమ కేసులను ఎత్తివేయాలని, ఉపా చట్టాన్ని రద్దు చేయాలని, తెలంగాణ పబ్లిక్ సెక్యూరిటీ చట్టాన్ని తొలగించాలని, ఎన్ఐఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, నగర అధ్యక్షుడు పి.ఎం.రాజు, ఎన్.వేణుగోపాల్, నార్ల రవి, నాయకుడు విష్ణు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్ ఎంసీహెచ్‌కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి



ఎంసీహెచ్ కాలనీలో పైపులైన్ పనులను పరిశీలిస్తున్న జలమండలి డీజీఎం మోహన్‌రాజ్ తదితరులు



కృష్ణానగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి

ముషీరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వెస్ట్ ఎంసీహెచ్ కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కొండా శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జలమండలి డీజీఎం మోహన్‌రాజ్‌తో కలిసి ఎంసీహెచ్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను, నిండిపోయిన డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను పరిశీలించారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. మ్యాన్‌హోల్స్ శుభ్రం చేయాలని, పైపులైన్ నిర్మాణ పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్‌కుమార్, నాయకులు డి. శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, నేత భాస్కర్, సత్యనారాయణ బాబు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానగర్‌లో..

రాంనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణానగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కార్పొరేటర్ రవిచారి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన బస్తీలో పర్యటించి డ్రైనేజీ సమస్యను పరిశీలించారు.



సంయుక్తను సన్మానిస్తున్న అతిథులు, నిర్వాహకులు

శ్రావ్యంగా శాస్త్రీయ గానగోష్ఠి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత గురువు సంయుక్త తమ శిష్యబృందంతో అన్నమయ్య, రామదాసుకీర్తనలు శ్రావ్యంగా గానం చేశారు. ఐఏఎస్ మాజీ అధికారి కేవీ రమణాచారి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో నిర్వహించిన సంయుక్త బృందం గానగోష్ఠి ఆకట్టుకుంది. సీనియర్ జర్నలిస్ట్ భైస దేవదాసు మాట్లాడుతూ.. సంగీతం మనసుకు విశ్రాంతినిస్తుందన్నారు. దేశంలో ఎక్కడా ఒక అధికారి ఉద్యోగ విరమణ చేసిన తర్వాత రోజుల తరబడి పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం వినలేదన్నారు. అది రమణాచారికే చెందుతుందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. రమణాచారి పట్ల ఉన్న అభిమానంతో కళాసప్తాహం జరిపామని, ఇందుకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

అసభ్యకరంగా ప్రవర్తించాడని రోకలి బండతో..



వహీద్ పాషా మృతదేహం

అంబర్‌పేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఓ వ్యక్తిని మహిళ హత్య చేసింది. అంబర్‌పేట సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట పటేల్‌నగర్‌లో నివసిస్తున్న రుక్మిణిబాయి(52) కూలి పని చేసుకొని జీవిస్తోంది. సాయంత్రంపూట రొట్టెలు అమ్ముకుంటుంది. అంబర్‌పేటలో నివసిస్తున్న వహీద్ పాషా(37) కూడా కూలిపని చేసుకొని జీవిస్తున్నాడు. అతడు అప్పుడప్పుడు రుక్మిణిబాయి వద్ద రొట్టెలు తీసుకుంటాడు. ఈనెల 8వ తేదీ రాత్రి తాగిన మైకంలో ఆమె ఇంటికి వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. కోప్రోదిక్తురాలైన ఆమె రోకలి బండతో అతడి కడుపుపై కొట్టి, గొంతు పిసకడంతో స్పృహతప్పి పడిపోయాడు. భయపడిన ఆమె అంబర్‌పేట పోలీసులకు విషయం చెప్పింది. వారు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా వహీద్ చనిపోయి ఉన్నాడు. పోలీసులు రుక్మిణిబాయిని విచారిస్తున్నారు.

'వాలెంటైన్స్ డే ను అడ్డుకుంటాం'

బర్కత్‌పుర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విదేశీ సంస్కృతి పేరుతో నకిలీ ప్రేమను ప్రోత్సహించే ఫిబ్రవరి 14 వాలెంటైన్స్ డేను అడ్డుకుంటామని పలు హిందూ సంస్థలు హెచ్చరించాయి. పార్కులు, హోటల్స్ విహార స్థలాల్లో సంచరించే కల్తీ ప్రేమికులకు బుద్ధి చెబుతామన్నాయి. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పండరినాథ్, ప్రచార ప్రముఖ్ పి.బాలస్వామి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు మాట్లాడారు. భారతీయ సంస్కృతిని కాపాడుకోవడానికి యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ శక్తులు విదేశీ శక్తులతో కుమ్మక్కై వాలెంటైన్స్ డేను ప్రమోట్ చేస్తున్నాయని ఆరోపించారు. కల్తీ ప్రేమను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

ఫిబ్రవరి 14న పుల్వామా అమరజవాన్లకు నివాళులర్పించడమే నిజమైన ప్రేమ అని వారన్నారు. ప్రేమికుల రోజును విడనాడి అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తూ వీరజవాన్లకు నివాళులర్పించాలని కోరారు. ప్రేమికుల దినోత్సవాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వాలెంటైన్స్ డేను వ్యతిరేకిస్తూ ముద్రించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు వెంకట్, అఖిల్, రాహుల్, చైతన్య ధీరజ్, సుమన్, నందకిషోర్ తదతరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత ధర్నాను అడ్డుకుంటాం

- **ధర్నాచౌక్‌ను ఎందుకు నిషేధించారో క్షమాపణ చెప్పాలి**
- **తెలంగాణ ఉద్యమకారులు**

బర్కత్‌పుర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ప్రాంగణంలో పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ నెల 12న చేయనున్న ధర్నాను అడ్డుకుంటామని తెలంగాణ ఉద్యమకారులు హెచ్చరించారు. కేసీఆర్ ప్రభుత్వం గతంలో ధర్నాచౌక్‌ను ఎందుకు నిషేధించిందో బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు పూలేను విస్మరించి అధికారం కోల్పోయిన తర్వాత ధర్నాలు చేయడం దయ్యాలు వేదాలు వల్లించడమేనని వారు ఎద్దేవా చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో తెలంగాణ సమాఖ్య కన్వీనర్ కరుణాకర్ దేశాయి, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ కన్వీనర్ రామగిరి ప్రకాష్ మాట్లాడారు. పూలే గురించి మాట్లాడే నైతిక హక్కు ఆమెకు లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడిస్తామని వారు హెచ్చరించారు. ఉద్యమకారులు శ్రీనివాస్ బండారి, గొల్లపల్లి నాగరాజు, సర్దార్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీసేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం





రాంనగర్, వివేక్‌నగర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వాసవీసేవా సమితి సభ్యులు, ఇన్‌స్పెక్టర్ సీతయ్య

రాంనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వాసవీసేవా సమితి రాంనగర్ శాఖ ఆధ్వర్యంలో అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం రాంనగర్ చౌరస్తాలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు వాడకట్టు రాజు, కాసనగొట్టు రాజశేఖర్‌గుప్తా, చల్లా శివకుమార్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ప్రతినెల అమావాస్య రోజున 500 నుంచి 800 మందికి అన్నదానం చేస్తున్నామని తెలిపారు. అన్నదాన దాతలు కాసనగట్టు రాజశేఖర్‌గుప్తా, కూర యాదగిరి, చల్ల అజయ్, సేవా సమితి కోశాధికారి గంజి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అల్పాహారం, పండ్ల పంపిణీ

అమావాస్యను పురస్కరించుకుని కందూరి కృష్ణ, సేఠ్ మాణిక్‌లాల్ ఫౌండేషన్ల సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం చిక్కడపల్లిలో పేదలకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ టి. చక్రపాణి, ఫౌండేషన్ల చైర్మన్‌లు కందూరి కృష్ణ, మాణిక్‌లాల్ ఆగర్వాల్, సభ్యులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య అన్నారు. చిక్కడపల్లి ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా శుక్రవారం వివేక్‌నగర్ అంజనేయస్వామి ఆలయం వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమం సంఘం అధ్యక్షుడు సింగారపు రమేష్‌గుప్తా అధ్యక్షతన నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రొద్దుటూరి నరసింహారావు, నరసిన వెంకటేశం కుటుంబసభ్యుల సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు చేపూరి లక్ష్మణ్, అమురం బాలకుమార్, చిట్టిమిళ్ళ శ్రీనివాస్, తొడుపునూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : మంత్రి జూపల్లి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కళల అభివృద్ధికి, కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వర్తమాన తరానికి కథక్ నృత్యంలో శిక్షణనిస్తూ వారిని ఉత్తమ నృత్యకళాకారులుగా తీర్చిదిద్దుతున్న ప్రముఖ కథక్ నృత్యకళాకారులు, నాట్యగురువు పండిట్ అంజిబాబును మంత్రి శుక్రవారం తన ఛాంబర్‌లో సన్మానించి అభినందించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు.

'పూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలి'

బర్కత్‌పుర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు దశ, దిశను చూపిన మహాత్మా జ్యోతీరావు పూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలని ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. భారతరత్న ఇవ్వాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ ఆవరణలో పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో సెంట్రల్ కమిటీ ప్రతినిధులు పి.అంబిక, దుర్గం పద్మాగౌడ్ తదితరులు ఉన్నారు.

పీవీకి భారతరత్న.. హర్షణీయం

కవాడిగూడ/రాంనగర్/చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించడంపట్ల తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా, చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డా. చిక్కా దేవదాసు హర్షం వ్యక్తం చేశారు. దేశానికి పీవీ చేసిన సేవలను గుర్తించి భారతరత్న ఇవ్వడం హర్షణీయమన్నారు.ఎన్టీఆర్‌కు కూడా భారతరత్న ఇవ్వాలని సాయిబాబా డిమాండ్ చేశారు.



పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

కనీస పెన్షన్ రూ. 9 వేలు ఇవ్వాలి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పబ్లిక్ సెక్టార్లలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి కనీస పెన్షన్ రూ. 9 వేలు ఇవ్వాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.నారాయణరెడ్డి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, ఉపాధ్యక్షుడు నరహరి డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెన్షన్ ఇవ్వాలని కోరారు. శుక్రవారం బర్కత్‌పురలో పీఎఫ్ కార్యాలయం ఎదుట పెన్షనర్లు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. హెచ్ఏఎల్, బీహెచ్ఈఎల్, ఈసీఐఎల్, మిథాని, ఐడీపీఎల్, బీడీఎల్, ఐడీఎల్ తదితర సంస్థల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి వెయ్యి నుంచి నాలుగువేల రూపాయల పెన్షన్ ఇస్తున్నారని, దీనిని రూ. 9 వేలకు పెంచాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా అమలు చేయడం లేదన్నారు.

బద్రుకా కాలేజీలో ఐటీ క్విజ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కాచిగూడలో బంకట్‌లాల్ బద్రుకా కాలేజీలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఐటీ క్విజ్ నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్‌తో పాటు ట్రోఫీ అందజేసి అభినందించారు. వివిధ కాలేజీల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత హనుమాన్ చౌదరి, కృష్ణకుమార్ అగర్వాల్ పాల్గొని విద్యార్థులు ఉన్నతస్థానంలో నిలిచేందుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. శ్రీకిషన్ బద్రుకా, ఎస్.అభిరామ కృష్ణ, మూర్తి, ఎస్.కృష్ణవేణి అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ స్థలాలను కాపాడాలి

రాంనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌టీ కాలనీలో కార్మికశాఖ స్థలాలను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వి.విజయరావు కోరారు. శుక్రవారం కాలనీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి నెంబర్ 1-1-1046/8/1 నుంచి 1-1-1046/15 వరకు గల క్వార్టర్స్ వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలాలను అక్రమించుకోవడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. స్థలాల అక్రమణను అడ్డుకుంటున్న తమపై దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థలాలను కాపాడి ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించాలని కార్మిక శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

మహిళల ఆర్థిక అభివృద్ధితోనే సాధికారత సాధ్యం



సర్టిఫికెట్ల ప్రదానోత్సవంలో కావ్యా కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే సాధికారత సాధ్యమవుతుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి కావ్యాకిషన్‌రెడ్డి అన్నారు. మహిళలు స్వయం ఉపాధితో ముందుకు సాగాలని కోరారు. శుక్రవారం బర్కత్‌పురలో ఏబీవీ ఫౌండేషన్ స్కిల్ సెంటర్‌లో స్వయం ఉపాధిరంగాలలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు, శ్రావ్యారెడ్డి, నీరజ, వనజ, రమ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

మోదీ విధానాలన్నీ కార్పొరేట్‌కు అనుకూలమే

- **సమ్మెను జయప్రదం చేయాలి : విద్యార్థి సంఘాలు**

హైదరాబాద్/రాంనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మోదీ అధికారంలోకి వచ్చాక దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిందని, ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం అవడంతో తిరోగమనం వైపు దేశం అడుగులు వేస్తోందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్ అన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. యువత సైద్ధాంతిక రాజకీయ, ఆర్థిక పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. మోదీ విధానాలన్నీ కార్పొరేట్‌కు అనుకూలమేనన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 16న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో యువత పెద్దఎత్తున పాల్గొనాలని, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.

విరిగిన చెట్టుకొమ్మ.. తప్పిన ప్రమాదం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పెద్ద చెట్టుకొమ్మ శుక్రవారం విరిగి రోడ్డుపై పడింది. చిక్కడపల్లి స్ట్రీట్‌నెంబర్ 3లో చెట్టుకొమ్మ విరిగి కారుపై పడడంతో వాహనం స్వల్పంగా ధ్వంసమైంది. ఆ సమయంలో అటువైపు వెళ్తున్న మహిళ, ముగ్గురు పిల్లలు త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. పాదచారుడికి స్వల్ప గాయమైంది. కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ ఈవీడీఎం సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో చెట్టు కొమ్మను తొలగించారు.

'ఆరు గ్యారెంటీలపై ప్రజలకు అవగాహన కల్పించండి'

నల్లకుంట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ఓబీసీ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్ ఆధ్వర్యంలో నల్లకుంటలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు హరినాథ్ గౌడ్ నివాసంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారెంటీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.